క్లుప్తంగా

సీసీ రోడ్డు పనులు ప్రారంభం



దామరగిద్ద: మండలంలోని మద్దెల్‌బీడ్‌లో శనివారం సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. ఎన్‌ఆర్‌ఈజీఎస్ ద్వారా రూ. 5లక్షలతో మంజూరుచేసిన సీసీరోడ్డు నిర్మాణ పనులను కాంగ్రెస్ నాయకులు నారాయణరెడ్డి, పూజలుచేసి పనులు ప్రారంభించారు. ఈ మేరకు వారు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే పర్ణికారెడ్డి ప్రత్యేక చొరవతో గ్రామానికి సీసీ రోడ్డు మంజూరు చేయడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. కార్యక్రమంలో గురునాథ్‌రెడ్డి, నారాయణరెడ్డి, బసిరెడ్డి, మాజీ ఎంపీపీ కన్కప్ప, లింగప్ప, బుగ్గప్ప, హనీఫ్, గోపాల్, కృష్ణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలి



కోస్గి: ఇసుక అక్రమ రవాణాను అడ్డుకోవాలని కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం కోస్గి, గుండుమాల్, కొత్తపల్లి తహసీల్దార్లు, ఎస్ఐ వాగుల్లో తనిఖీలు చేశారు. ప్రభుత్వం నుంచి రవాణా చేస్తున్న పెద్ద వాగు పరిధిలోని వాగుల్లో అధికారులు పర్యటించి ఎలాంటి అక్రమ ఇసుక రవాణా కావడం లేదని, ఉన్నతాధికారులకు సమాచారమిచ్చారు. ఎక్కడైన అక్రమంగా ఇసుక రవాణా జరుగుతున్నట్లు తెలిస్తే తహసీల్దార్, పోలీసులకు గాని సమాచారమివ్వాలని అధికారులు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్లు శ్రీనివాసులు, పాండు, అనిల్‌కుమార్, ఎస్ఐ శేఖర్‌గౌడ్, ఆర్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



మాగనూర్: వేసవిలో దాహం తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని తళంకేరి గ్రామస్తులు అన్నారు. శనివారం మండలంలోని స్థానిక ఆంజనేయ స్వామి ఆలయం వద్ద చలివేంద్రం కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్తులు మాట్లాడుతూ.. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ముందుకు వచ్చిన జైహనుమాన్ లిమిటెడ్ డైరెక్టర్ బీటీఎం తిమ్మప్పను అభినందిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్ చిత్రపటానికి క్షీరాభిషేకం



ధన్వాడ: పద్మశాలి కార్పొరేషన్ ఏర్పాటుచేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం మండల కేంద్రంలోని సీఎం రేవంత్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ మేరకు.. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నరహరి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో సీఎం రేవంత్ రాష్ట్రంలో అన్ని వర్గాలని గుర్తించి వారి అభివృద్ధికోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేశారన్నారు. కార్యక్రమంలో నరేందర్, నర్సింహులు, లక్ష్మయ్యగౌడ్, శివరాములు, వేణు, గోపి, నరేందర్‌గౌడ్, రఘు, నారాయణ, బాలయ్య, బాల్‌రాజు, ఆనంద్‌గౌడ్ పాల్గొన్నారు.

యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో..

మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆధ్వర్యంలో శనివారం బ్యాంక్ ద్వారా అందిస్తున్న ఉచిత సేవలను మేనేజర్ రాజు గ్రామస్తులకు వివరించారు. ప్రభుత్వం నుంచే అందించే ప్రతి పథకం నిధులు బ్యాంక్‌ల ద్వారానే ప్రజలకు చేరుతుందన్నారు. పీఎంజేబీవై, పీఎంఎస్‌బీవై చేసుకోవడంతో ప్రమాదవశాత్తు చనిపోయిన రూ. 2లక్షలు ఇన్స్‌రెన్స్ వస్తుందని తెలిపారు. కంపెనీ జోనల్ మేనేజర్ వీరేష్‌కుమార్, సదానందం, హజరత్ అలీ పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన

మాగనూర్: మండలంలోని కొల్పూర్‌లో ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మ జ్యోతిబాయిపూలే విగ్రహ కమిటీ నాయకులు నర్సింహులు మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ ఓటుహక్కును వినియోగించుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. అదేవిధంగా త్వరలో జరగబోయే లోక్‌సభ ఎన్నికలు, గ్రామ సర్పంచ్ ఎన్నికలలో తమ ఓటును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం లక్ష్మారెడ్డి, గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.



'పది' పరీక్షలకు సర్వం సిద్ధం

- జిల్లాలో 38 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు
- హాజరు కానున్న 7,611 మంది విద్యార్థులు



జిల్లా కేంద్రంలోని పరీక్ష కేంద్రంలో నంబర్లు వేస్తున్న సిబ్బంది

నారాయణపేట రూరల్: ఈనెల 18నుంచి ప్రారంభంకానున్న పదో తరగతి వార్షిక పరీక్షలకు విద్యాశాఖ అధికారులు ఏర్పాట్లు పూర్తిచేశారు. జిల్లాలో 7,678 మంది విద్యార్థులకుగాను 38 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలను మూడు కేటగిరీలుగా విభజించారు. ఏడు కేంద్రాలకు ప్రత్యేకంగా సీ కస్టోడియన్లను నియమించడంతో పాటు వాహనాలను ఏర్పాటుచేశారు. రోజు ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు పరీక్షలు కొనసాగుతాయి. విద్యార్థులను అరగంట ముందునుంచే కేంద్రంలోకి అనుమతిస్తారు. ఈసారి 5 నిమిషాలు గ్రేస్ టైమ్‌గా నిర్ణయించారు. 9:35 గంటల తర్వాత అనుమతి ఉండదు.

సిబ్బంది కేటాయింపు పూర్తి..

పరీక్షల నిర్వహణకు అవసరమైన సిబ్బంది నియామకం శుక్రవారం వరకు కొనసాగింది. జిల్లా వ్యాప్తంగా 38 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 40 మంది డిపార్ట్‌మెంట్ అధికారులు, 382 మంది ఇన్విజిలేటర్లను నియమించి, పరీక్షల నిర్వహణపై శిక్షణ ఇచ్చారు. ఆరుగురిని కస్టోడియన్స్‌గా, 6 సిట్టింగ్ స్క్వాడ్స్, 2 ఫ్లయింగ్ స్క్వాడ్స్ బృందాలను ఏర్పాటు చేశారు. 10 పోలీస్‌స్టేషన్లను ప్రశ్నపత్రాల స్టోరేజ్ పాయింట్స్‌గా గుర్తించారు. ప్రతి పరీక్ష కేంద్రం వద్ద ముగ్గురు చొప్పున పోలీసు బందోబస్తు నిర్వహించనున్నారు.

పరీక్ష కేంద్రాల్లో వసతుల కల్పన..

పరీక్ష కేంద్రాల్లో అవసరమైన మౌలిక వసతుల కల్పనపై ఎంఈఓలు, కస్టోడియన్‌లు ప్రత్యేక దృష్టి సారించారు. తాగునీరు, ఫర్నిచర్, మరుగుదొడ్ల తదితర వాటిని ఏర్పాటుచేశారు. పరీక్ష సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడకుండా చర్యలు చేపట్టారు. వార్షిక పరీక్షల సందర్భంగా విద్యాశాఖ ప్రత్యేకంగా కంట్రోల్‌రూం ఏర్పాటు చేశారు. సందేహాల నివృత్తి, సలహాలు, సూచనలకు 94419 46858 నంబర్‌ను సంప్రదించాలి.

విద్యార్థులు పాటించాల్సిన నియమాలు..

- పరీక్ష కేంద్రానికి అరగంట ముందుగానే చేరుకోవాలి.
- ప్రైవేటు విద్యార్థులు యూనిఫాం ధరించరాదు.
- సెల్‌ఫోన్ ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదు.
- హాల్‌టికెట్, పరీక్ష ప్యాడ్‌తో పాటు వాటర్‌బాటిల్, చేతిరుమాలు వెంట తెచ్చుకోవాలి.
- వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకున్న హాల్‌టికెట్‌తో పరీక్షకు హాజరుకావొచ్చు.

అన్ని సదుపాయాలు కల్పించాం



పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాం. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సదుపాయాలు ఏర్పాటుచేశాం. అవసరం మేరకు సీసీ కెమెరాలను ఉపయోగిస్తాం. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాయాలి.

– రమేష్‌శెట్టి, జిల్లా పరీక్షల విభాగం అధికారి

వైభవంగా రాఘవేంద్రస్వామి జయంతి ఉత్సవాలు



ఆలయంలో స్వామివారి రథోత్సవం

నారాయణపేట రూరల్: పట్టణంలోని పరిమళాపురం శ్రీ రాఘవేంద్రస్వామి ఆలయంలో శనివారం జయంతి ఉత్సవాలు వైభవంగా కొనసాగాయి. ఈ సందర్భంగా అర్చకులు నర్సింహచారి ఆధ్వర్యంలో స్వామివారికి అభిషేకం, అర్చన, ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామివారి ఉత్సవ విగ్రహంతో పల్లకిసేవా, రథోత్సవం చేపట్టారు. ప్రముఖ జ్యోతిష్యపండితుడు అనిల్ దేశాయ్ హాజరై స్వామివారి జీవిత విశేషాలను వివరించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తా వద్ద స్వామివారి భక్తబృందం ఆధ్వర్యంలో చలివేంద్రం ఏర్పాటుచేసి జిల్లా ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో లయన్స్‌క్లబ్ కో షాధికారి రవి కుమార్‌గౌడ్, వినోద్, సేవాసమితి సభ్యులు గోపీనాథ్, రఘునాథ్, అనంతరావు, ధరణీధర్ తదితరులు పాల్గొన్నారు.

'కవిత అరెస్టు సరికాదు'



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి

నారాయణపేట: ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అరెస్ట్ సరికాదని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డి అన్నారు. శనివారం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ నేతలు రాష్ట్రంలో బీఆర్‌ఎస్‌ను దెబ్బతీసేందుకు కుట్రలు పన్నుతున్నారని, అందులో భాగంగానే కవితను అరెస్టు చేశారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.సుదర్శన్‌రెడ్డి, గందెచంద్రకాంత్, కన్నా జగదీశ్, విజయ్‌సాగర్, చెన్నారెడ్డి, జోన్నల సుభాష్ తదితరులు ఉన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మక్తల్‌లో అవగాహన కల్పిస్తున్న మల్లేశ్వరి

మక్తల్: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మల్లేశ్వరి అన్నారు. శనివారం మండలంలోని జక్లేర్‌లో అంగన్‌వాడీలో పోషణపక్షం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణి, బాలింతలకు పౌష్టికాహారం ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, గర్భిణి, బాలింతలు తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: మండలంలోని అమ్మపల్లిలో అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడ్‌పై అంగన్‌వాడీ టీచర్ మమత గర్భిణీ, బాలింతలకు అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ చిన్నారులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు ప్రతి ఒక్కరూ పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయాలు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం


మద్దూరు: మద్దూరు 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాలకు ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని విద్యుత్ ఏఈ నిరంజన్‌దాస్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ స్తంభాల కింద ఏపుగా చెట్లు పెరగడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని, దీంతో వీటిని తొలగించడానికి ఆదివారం ఉదయం 10:30నిమిషాల నుంచి 12:30 వరకు, సాయంత్రం 3గంటల నుంచి 5గంటల అంతరాయం ఉంటుందన్నారు.

దామరగిద్ద: మండల కేంద్రంలోని వివిధ కాలనీల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లు మర్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ తెలిపారు.


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

మద్దూరు: మండల కేంద్రంలో శనివారం ఐపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభించారు. మండలం నుంచి 11టీంలు ఈ టోర్నమెంట్‌లో పాల్గొంటున్నాయని నిర్వహకులు నరేష్ కుమార్, రామకృష్ణ, జడల రాజు తెలిపారు. నెలరోజులపాటు నిర్వహించే ఈ టోర్న మెంట్‌లో విజేతలకు రూ. 50వేలు, రెండో బహుమతి రూ. 25వేలు అందజేయడం జరుగుతుందన్నారు. రామకృష్ణ, చందు, ప్రకాష్ టోర్నమెంట్‌ను ప్రారంభించారు.

బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన



మద్దూర్‌లో మాట్లాడుతున్న ప్రతినిధి విజయ్‌కుమార్



కృష్ణాలో మాట్లాడుతున్న అనిత

మద్దూరు: ముస్లిం మహిళలకు బాలిక విద్యపై మహిళాభివృద్ధి శిశు సంక్షేమా శాఖ ఆధ్వర్యంలో శనివారం మండలంలో నిర్వహిస్తున్న బేటీ బచావో- బేటీ పడావో ప్రతినిధి విజయ్‌కుమార్ అవగాహన కల్పించారు. ఈ మేరకు.. ఏర్పాటుచేసిన మైనార్టీ పేరెంట్స్ సమావేశంలో బాలికలు ఉన్నత చదువులు చదివే జరిగే ప్రయోజనం వివరించారు. ముస్లింలలో ఎక్కువ శాతం బాలికలను ఉన్నత చదువులు చదివించడానికి మొగ్గు చూపడం లేదన్నారు. దీంతో కుటుంబాలు వెనుకబడి పోతా యని వివరించారు. ఈ కార్యక్రమంలో ముస్లిం మహిళలు యాస్మిన్‌బేగం, ఫరిదాబేగం, ఆర్షియాబేగం, సాజిదా తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: అమ్మాయిలను అన్నిరంగాల్లో ఏదిగేందుకు ప్రతి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని జెండర్ స్పెషలిస్ట్ అనిత, సీఏసీసీ మెంటర్ రేణుక సూచించారు. శనివారం మండలంలోని హిందుపూర్‌లో బేటీ బచావో.. బేటీ పడావోపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మేరకు.. వారు మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలంటే ముందు కుటుంబం నుంచే ప్రారంభం కావాలని, ఆడ పిల్లలను అన్నిరకాలుగా వారికి సహాయ సహకారాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు మల్లమ్మ, రజియాబి, మెహబూబ, షహీన్‌బేగం, తస్లీమాబేగం తదితరులు పాల్గొన్నారు.

పదోతరగతి పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



ఊట్కూరు: మండలంలో ఈ నెల 18న నిర్వహించే పదోతరగతి వార్షిక పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. మండలంలోని బాలుర, బాలికల ఉన్నత పాఠశాల, పులిమామిడిలోని ఉన్నత పాఠశాలలో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పరీక్షలకు చిన్నపొర్ల, పెద్దజట్రం, పులిమామిడి, ఊట్కూరు, బిజ్వార్, పులిమామిడి కేజీబీవీ పాఠశాలల విద్యార్థులు హాజరవుతారని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు పోన్‌లు తీసుకొని రావొద్దని పరీక్ష సమాయానికంటె అరగంట ముందు పరీక్ష కేంద్రాలకు రావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో నోడల్ అధికారి సురేష్, చీఫ్ సూపరిండెంట్ రఘువీర్, దత్తురావు తదితరులు పాల్గొన్నారు.

కూలీల సంఖ్య పెంచాలి

ఊట్కూరు: వేసవి కాలంలో ఉపాధిహామీ పథకంలో కూలీలకు పని కల్పించాలని డీఆర్‌డీఓ అధికారి రాజేశ్వరి అన్నారు. శనివారం లక్ష్మిపల్లి, నిడుగుర్తి గ్రామాల్లో కొనసాగుతున్న ఉపాధిపనులను, నర్సరీలను పరిశీలించారు. నర్సరీలలో పెంచుతున్న మొక్కల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గ్రామాలలో కూలీల సంఖ్యను పెంచాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ధనుంజయ్యగౌడ్, బసిరెడ్డి, బీమయ్య పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



మరికల్: పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం తరపున కీర్తిపురస్కారానికి ఎంపికైన మండలానికి చెందిన డాక్టర్. బాలస్వామిని 1994–95 బ్యాచ్ పూర్వ విద్యార్థులు శనివారం సన్మానించారు. తెలుగు సాహిత్యంలో వివిధ పద్య రచనలు రచించి జాతీయస్థాయిల్లో ఎంతో పేరు ప్రతిష్టలు తీసుకొచ్చిన రిటైర్డ్ తెలుగు ఉపాధ్యాయుడు బాలస్వామి సేవలు మరువలేనివని పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కమల్, ఆంజనేయులు, రవి పాల్గొన్నారు.

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ..

మద్దూరు: మండల కేంద్రంలో బాష్యం పాఠశాలలో శనివారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం చక్కగా బోధించిన విద్యార్థులకు పాఠశాల యాజమాన్యం బహుమతులు అందజేశారు. పాఠశాల సిబ్బంది, యాజమాన్యం పాల్గొన్నారు.

హాల్‌టికెట్ల పంపిణీ

కృష్ణా: మండలంలోని ముడుమాల్ ఉన్నత పాఠశాలలోని పదోతరగతి విద్యార్థులకు శనివారం హెచ్ఎం నిజాముద్దీన్ హాల్‌టికెట్లను పంపిణీ చేశారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థి హాల్‌టికెట్లను జాగ్రత్తగా ఉంచుకొని పరిక్షా కేంద్రానికు వెళ్లాలని, అలాగే పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధాని మోదీ సభకు తరలిన నాయకులు

మరికల్: నాగర్‌కర్నూల్‌లో నిర్వహించిన విజయ సంకల్ప యాత్రకు మండలం నుంచి బీజేపీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. మండలంలోని అన్ని గ్రామాల నుంచి శనివారం నాగర్‌కర్నూల్ విజయసంకల్ప సభలో పాల్గొనే ప్రధాని మోదీ సభను విజయవంతం చేసేందుకు తరలిచ్చామని మండల అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో వేణు, శ్రీరామ్, వియ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేష్, వెంకటేష్ పాల్గొన్నారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి



సింగారంలో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు



కోస్గిలో ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్న ప్రత్యేక బలగాలు

నారాయణపేట రూరల్: ప్రజాస్వామ్యంలో ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకునే స్వేచ్ఛ ఉందని, భయపడకుండా ధైర్యంగా తమ ఓటును సద్వినియోగం చేసుకోవాలని సీఐ శివశంకర్ అన్నారు. శనివారం మండలంలోని పేరపళ్ల, సింగారం గ్రామాల్లో టౌన్ పోలీసుల ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో ఫ్లాగ్‌మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాంతియుత వాతావరణంలో నిర్వహించడానికి ఎన్నికల సంఘం, పోలీసుశాఖ అన్నిఏర్పాట్లు చేసిందన్నారు. ఎన్నికల విషయంలో ఎవరైన అవాంఛనీయ సంఘటనలకు పాల్పడే అవకాశం ఉన్నట్లు ఎవరి దృష్టికి వచ్చిన వెంటనే డయల్ 100కు సమాచారమివ్వాలన్నారు. ఎస్ఐ వెంకటేశ్వర్లు, పోలీసుబృందం పాల్గొన్నారు.

కోస్గి: ప్రజల్లో విశ్వాసం కల్పించడమే లక్ష్యంగా పోలీసు ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహిస్తున్నామని ఎస్ఐ శేఖర్‌గౌడ్ అన్నారు. ఈ మేరకు శనివారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని సమస్యాత్మక గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో కవాతు నిర్వహించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని, ఎన్నికలు ఏవైన ప్రజలు తమ ఓటు హక్కును ధైర్యంగా వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో నిర్వహించడమే పోలీసు శాఖ లక్ష్యంగా ఇలాంటి ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ మేరకు సర్జఖాన్‌పేట, తోగాపూర్ గ్రామాల్లో ప్రత్యేక పోలీస్ బలగాలతో పురవీధుల గుండా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్‌ఏఎఫ్ సిబ్బంది, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు వీడ్కోలు సమావేశం



ప్యాడ్లుపంపిణీ చేస్తున్న అధికారి రాజేంద్రకుమార్

నారాయణపేట రూరల్: పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు శనివారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన డీఈఓ కార్యాలయ సెక్టోరియల్ అధికారి రాజేంద్రకుమార్ మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదువుకుని చక్కటి మార్కులు సాధించాలన్నారు. అనంతరం విద్యార్థులు పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు రాజేష్‌కుమార్, దత్తుచౌద్రి, టీచర్లు సుజాత, భానుప్రకాష్, మాధవి, మధుసూదన్‌రావు, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

– అదేవిధంగా షెడ్యూల్డ్ కులాల వసతిగృహంలో ఉంటు వివిధ పాఠశాలల్లో టెన్త్ చదువుతున్న విద్యార్థులకు కలెక్టర్ శ్రీహర్ష ఆశీర్వాదం అందించారు. ఈ సందర్భంగా చిన్నారులతో ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ కష్టపడి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికారిణి కన్యాకుమారి, సిబ్బంది తదిరులు పాల్గొన్నారు.

వంశీచంద్‌రెడ్డిని గెలిపిద్దాం



వాల్‌క్లాక్‌లను అందజేస్తున్న నాయకులు

నర్వ: యువతకు ఆదర్శప్రాయుడైన యువజన నాయకుడు కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డిని గెలిపిద్దామని టీపీసీసీ ప్రచార కమిటీ జాయింట్ కన్వీనర్ బంగ్లా లక్ష్మీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఎంపీటీసీ నీరజ్ వంశీచంద్‌రెడ్డి గెలుపునకు యువకులు ఎంపీ అభ్యర్థిని గెలిపించాలని వాల్‌క్లాక్‌లను అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు గౌరారెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, అయ్యప్పరెడ్డి, రామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను గుర్తించాలి



ప్రభుత్వ భూమిని పరిశీలిస్తున్న కడా ప్రత్యేకాధికారి వెంకట్‌రెడ్డి

మద్దూరు: కొత్తపల్లి మండలంలోని ప్రభుత్వ భూములను గుర్తించాలని కడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డి తహసీల్దార్ అనిల్‌కుమార్‌కు ఆదేశించారు. శనివారం మండలంలోని తిమ్మారెడ్డిపల్లిలో గురులోకామాసంద్ ప్రభు ఉత్సవాలు ఏప్రిల్‌లో కొనసాగుతాయి. ఆలయ నిర్మాణ పనులు, అక్కడే భక్తులకోసం చేయాల్సిన ఏర్పాట్లను అధికారులను అడిగి తెలుసుకున్నారు. నందిగామలో సర్వే నంబర్ 83లో ఉన్న 118ఎకరాల ప్రభుత్వ భూమిని పరిశీలించారు. అలాగే గోకుల్‌నగర్‌లో శ్రీ కృష్ణ ఆలయాన్ని పరిశీలించారు. అతి పురాతన ఆలయ అభివృద్ధికోసం అంచనాలు సిద్ధం చేయాలని, అలాగే భూనీడ్ చెరువు కాల్వ గ్రామంలోంచి ఉంది కాబట్టి దానిపై కప్పు వేయడానికి అంచనాలు వేయాలని అధికారులకు ఆదేశించారు. అల్లీపూర్‌లో నూతన అంగన్‌వాడీ బిల్డింగ్‌కోసం ప్రతిపాదనలు సిద్ధం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, షేక్‌మీరాన్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు పరీక్ష ప్యాడ్ల పంపిణీ



మక్తల్‌లో విద్యార్థులకు అంబాదాస్‌రావు



ఊట్కూరులో..

ఊట్కూరు: మండలంలోని శ్రీరాంనగర్ ప్రాథమిక పాఠశాలలో శనివారం తమ పిల్లల పుట్టిన రోజు సందర్భంగా సామాజిక కార్యకర్త నారాయణ పేద విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈమేరకు.. హెచ్ఎం తిప్పన్న మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్యాడ్లు పెన్నులు పంపిణీ చేయడం సంతోషకరమన్నారు. ఉపాధ్యాయులు రవికుమార్, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: పట్టణంలోని శాంతినికేతన్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు అంబాదాస్‌రావు ఆధ్వర్యంలో ప్యాడ్లు, పెన్నులు అందజేశారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ రోహిణి, చైర్మన్ రమేష్, రవికుమార్‌గౌడ్, శరణప్ప, బ్రహ్మానందం, ఇంద్ర, అంబ్రేష్ తదితరులు పాల్గొన్నారు.

భగత్‌సింగ్ వర్ధంతి సభల వాల్‌పోస్టర్ విడుదల



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న నాయకులు

ఊట్కూరు: మండలంలోని బిజ్వార్‌లో పీవైఎల్ ఆధ్వర్యంలో శనివారం భగత్‌సింగ్ వర్ధంతి మహాసభల వాల్‌పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ మేరకు.. పీవైఎల్ రాష్ట్ర నాయకుడు ఆంజనేయుగౌడ్ మాట్లాడుతూ ఈ నెల 30వరకు భగత్‌సింగ్ వర్ధంతిని నిర్వహిస్తున్నామన్నారు. యువకులు భగత్‌సింగ్ స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రాజు, అనీల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

దామరగిద్ద: మండలంలోని కాన్‌కుర్తిలో పంచాయతీ కార్మికుడిగా పనిచేస్తున్న లక్ష్మప్ప ఆకస్మికంగా మృతిచెందారు. స్థానిక ఎంపీటీసీ మో నపురం బస్వరాజ్, కాంగ్రెస్ నాయకులు సుదర్శన్ రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ జ్ఞానేశ్వర్ ప్రగాఢ సంతపాన్ని తెలియజేశారు. అనంతరం బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం అందజేశారు. సంతాపం తెలిపిన వారిలో స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎండీ మోహిన్ పాల్గొన్నారు.